## సమాచారం

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**హఫీజ్‌పేట్ :** మాతృశ్రీనగర్, చందానగర్ సబ్ స్టేషన్ల పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ పేర్కొన్నారు.

- కల్యాణి గార్డెన్ ఫీడర్ పరిధిలో ఉదయం 09.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు హైదర్‌నగర్ పెట్రోల్ పంప్, మియాపూర్ ప్రధాన రోడ్డు, మాతృశ్రీనగర్, కల్వరి టెంపుల్ రోడ్డు, మెట్రో రైల్వే స్టేషన్, మాధవనగర్, మియాపూర్ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- చందానగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ల్యాండ్‌మార్కు రెసిడెన్సీ, ఆర్టీసీ కాలనీ, జెనిసిస్ స్కూల్, తులసీరాం చాంబర్స్ ప్రాంతాలలో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ తెలిపారు.

**తారానగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో..**

**గచ్చిబౌలి:** తారానగర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఇన్‌చార్జీ ఏఈ జి.ఉమారాణి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు హుడాకాలనీ ప్రాంతంలో విద్యుత్ ఉండదని తెలిపారు.

**శాంతినగర్ 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో ..**

**గచ్చిబౌలి:** శాంతినగర్ 11కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఇన్‌చార్జీ ఏఈ జి ఉమారాణి తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శాంతినగర్ మొత్తం ప్రాంతం, చందానగర్‌లోని మెయిన్‌రోడ్డు ప్రాంతంలో విద్యుత్ ఉండదని ,వినియోగదారులు గమనించాలని కోరారు.

## క్లుప్తంగా

### 'సండే ఈవినింగ్ టాక్'

**రాయదుర్గం:** బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ ప్రాంగణంలో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' ఏర్పాటు చేశారు. 'కాన్షియస్లీ క్రియేటింగ్ ఏ బ్యూటీఫుల్ వరల్డ్' అనే అంశంపై కెనడా హ్యాలీఫ్యాక్స్‌కు చెందిన డాక్టర్ డెబ్బిక్యాస్టిల్, డాక్టర్ డేవిడ్‌ఫ్లెచర్ ఉపన్యాసం ఇస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కార్యక్రమం ఉంటుంది. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040–23001234లో సంప్రదించాలి.

### నేడు శంకుస్థాపనలు

**మియాపూర్ :** మియాపూర్, చందానగర్‌లోని పలు కాలనీలో అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపనలు చేయనున్నట్లు ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. చందానగర్ డివిజన్ పరిధిలో కోటి15 లక్షల అంచనా వ్యయంతో పీఏనగర్‌లో సీసీ రోడ్డు పనులకు, వేమన కాలనీలో జిమ్ ప్రారంభోత్సవం, మియాపూర్‌లో రూ.3కోట్ల 60లక్షలతో, ఎఫ్‌సీఐ కాలనీ, ఎంఏ నగర్ క్రిష్ణసాయి ఎన్‌క్లేవ్, డీకేఎన్‌క్లేవ్, జేపీనగర్, లోటస్ ఎన్‌క్లేవ్, డాక్టర్ కాలనీ, దోవాకాలనీలో సీసీ రోడ్డు, వరదనీటి కాల్వల పనులకు శంకుస్థాపన చేస్తామన్నారు.

### వైభవంగా రంగనాథుడి రథోత్సవం

**రాయదుర్గం:** రంగనాథ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రథోత్సవంను నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో రంగనాథస్వామి, మహాలక్ష్మీ మాత, ఆళ్వారు స్వాములకు పూజలు చేశారు. రథోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

**లక్ష్మణ్‌బాగ్‌లో..**

లక్ష్మణ్‌బాగ్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారిని గరుడ వాహనంపై ఊరేగించారు. అంతకుముందు వేంకటేశ్వరస్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో రాయదుర్గం, పరిసర కాలనీల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### జీతాలు ఇవ్వాలంటూ ధర్నా

- గచ్చిబౌలి స్టేడియం ఎదుట సిబ్బంది నిరసన
- అధికారుల హామీతో విరమణ

**గచ్చిబౌలి:** మూడు నెలలుగా జీతాలు ఇవ్వకపోతే ఎలా అంటూ గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియం ముందు సెక్యూరిటీ, ఇతర సిబ్బంది శుక్రవారం ధర్నా చేశారు. జీతాలు చెల్లించాలని నినాదాలు చేశారు. స్టేడియంలో 47 మంది సెక్యూరిటీ సిబ్బంది, 25 మంది ఇతర విభాగాల సిబ్బంది ఉన్నారు. 3 నెలలుగా జీతాలురాక నానాఇబ్బందులు పడుతున్నామని వారు వాపోయారు. అధికారులు వచ్చి సోమవారం లేదా మంగళవారం జీతాలు ఇచ్చేలా చూస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు.





గోకుల్ ప్లాట్స్‌లో అభివృద్ధికి నోచుకోని సందయ్య పార్కు



పార్కులో గతంలో ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంకు

# సడీసప్పుడు లేని సందయ్య

- అభివృద్ధికి నోచుకోని పార్కు
- పార్కు స్థలం కబ్జాకు యత్నం
- స్థలాన్ని కాపాడాలంటున్న స్థానికులు



బోర్‌వెల్



**హఫీజ్‌పేట్ :** మాదాపూర్ డివిజన్ గోకుల్ ప్లాట్స్‌లోని సందయ్య పార్కు అభివృద్ధికి నోచడం లేదు. నిధులున్నా పనులు ప్రారంభం కాలేదు. ఈ గోకుల్ ప్లాట్స్‌లో వేలాది కుటుంబాలు నివసిస్తున్నాయి. కాలనీలో ఆరు పార్కులు ఉన్నాయి. అందులో సందయ్య పార్కు మాత్రం అలాగే ఉండిపోయింది. ఉదయం, సాయంత్రం వేళల్లో సరదగా గడపడానికి ప్రజలు పార్కులకు వెళుతుంటారు. ఈ క్రమంలో ఈ పార్కును అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. కాగా ఖాళీగా ఉన్న పార్కు స్థలంలో కొందరు అక్రమంగా వాహనాలు పార్కు చేస్తూ కబ్జాకు ప్రయత్నిస్తున్నారని, అధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

- 1986 సంవత్సరంలో సర్వే నంబర్ 78లో 215 ఎకరాల విస్తీర్ణంలో గోకుల్ ప్లాట్స్ లేవుట్ జరిగింది. దీనిలో దాదాపు 2వేల పాట్లు ఏర్పాటు చేశారు.
- కాలనీలో సుమారు 6 పార్కులు ఉండగా 5 పార్కులను అభివృద్ధి చేశారు. కానీ సందయ్య పార్కు మాత్రం ఇప్పటి వరకు అభివృద్ధికి నోచుకోలేదు.
- సందయ్య పార్కు 2400 గజాలు ఉండగా, ఆ పార్కు స్థలాన్ని కాలనీ అసోసియేషన్ సభ్యులు కబ్జాకు గురి కాకుండా కాపాడుతున్నారు.
- 15 సంవత్సరాల క్రితం అప్పటి ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ సందయ్య పార్కు అభివృద్ధి కోసం రూ..5 లక్షలు మంజూరు చేయించారు.
- పార్కులో ఒక బోర్ వెల్, నీటి ట్యాంకు, రెండు విద్యుత్ మీటర్లను ఏర్పాటు చేయించారు.
- 2015 సంవత్సరంలో కొంత మంది వ్యక్తులు పార్కు స్థలం తమదంటూ దస్తావేజులను తీసుకొచ్చి కబ్జాకు యత్నిస్తున్నారు.
- కబ్జాదారులపై పలుమార్లు ఎమ్మెల్యే, జోనల్ కమిషనర్, కార్పొరేటర్, పోలీస్ అధికారులకు ఫిర్యాదులు కాలనీ అసోసియేషన్ సభ్యులు వినతి పత్రాలు అందజేశారు.
- కొంత మంది పార్కు స్థలంలో కడీలు వేసి నిర్మాణాలకు యత్నించగా జీహెచ్‌ఎంసీ అధికారులు, కాలనీవాసులు అడ్డుకున్నారు.

**అధికారులు స్పందించాలి**



సందయ్య పార్కు స్థలాన్ని కొంతకాలంగా ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేయడానికి యత్నాలు చేస్తున్నారు. పార్కు అభివృద్ధి జరగకుండా కొంతమంది అడ్డుకుంటున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ అధికారులు నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేయాలి.

– సాంబయ్య, అధ్యక్షుడు, గోకుల్‌ప్లాట్స్ కాలనీ

**ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకోవాలి**



సందయ్య పార్కు అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకోవాలి. సందయ్య పార్కు ఒక్కటే అభివృద్ధికి నోచుకోలేదు. వెంటనే జీహెచ్‌ఎంసీ అధికారులు పనులు ప్రారంభించాలి.

–రూబిన్ గౌడ్, గోకుల్ ప్లాట్స్ కాలనీ

**స్థల వివాదంతో పనులకు ఆటంకం**

సందయ్య పార్కుకు సుమారు రూ.8.50 లక్షల నిధులు మంజూరయ్యాయి. కానీ స్థల వివాదం వల్ల పార్కు పనులు ప్రారంభించలేకపోతున్నాం. సమస్య పరిష్కారం అయిన తరువాత అభివృద్ధి పనులు చేపడతాం.

– శ్రీకాంతి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, చందానగర్ సర్కిల్– 21



హ్యాకథాన్‌లో పాల్గొన్న విద్యార్థులు

## ట్రిపుల్ ఐటీలో హ్యాకథాన్

**రాయదుర్గం:** ట్రిపుల్‌ఐటీ–హైదరాబాద్, ప్రవాహ ఫౌండేషన్ సహకారంతో ప్రత్యేక పాన్ ఇండియా హ్యాకథాన్ నిర్వహించింది. ఈ హ్యాకథాన్ ప్రత్యేకంగా 10 నుంచి 17 ఏళ్ళ వయస్సు వారికి నిర్వహించారు. భారతదేశంలోని వివిధ నగరాల నుంచి మొత్తం 55 జట్లు ఈ పోటీలో పాల్గొన్నాయి. ఈ హ్యాకథాన్‌లో 'సాంకేతికత ద్వారా సుస్థిరత' అంశంపై వాతావరణ మార్పు సమస్యలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పరిష్కారాలను రూపొందించడం, ఐక్యరాజ్యసమితి యొక్క స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు(ఎస్‌డీజీ)లు సాధించాలని నిర్ణయించారు. సమస్య పరిష్కార సామర్థ్యాలు, డిజైన్ సామర్థ్యం, ప్రదర్శన, వ్యవస్థాపక నైపుణ్యాలు, విద్యార్థులలో పర్యావరణ అవగాహనను అభివృద్ధి చేసింది. ఫైనల్స్‌లో విజేతలు, రన్నరప్‌లు మెమెంటోలు, రూ.25వేల వరకు నగదు బహుమతులు, సర్టిఫికెట్లను అందుకున్నారు.





చిత్ర ప్రదర్శనను ప్రారంభించిన రాష్ట్ర ఫిల్మ్, టీవీ డెవలప్‌మెంట్ చైర్మన్ అనిల్ ఆకట్టుకుంటున్న చిత్రం

## చిత్ర ప్రదర్శన ప్రారంభం

**మాదాపూర్:** మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో శుక్రవారం ది విగిలి ఇన్ బాతిక్ చిత్రప్రదర్శన ప్రారంభమైంది. చిత్రకళాకారిణి మారియా క్లార వేసిన చిత్రాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయని రాష్ట్ర ఫిల్మ్, టీవీ డెవలప్‌మెంట్ చైర్మన్ అనిల్ కుర్మచలమ్ పేర్కొన్నారు. ఈ ప్రదర్శన 9వ తేదీ వరకు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ఉదయం 10గంటల నుంచి రాత్రి 7గంటల వరకు ప్రదర్శన అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, క్యూరేటర్ ప్రీతి సంయుక్త భట్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ రోడ్లకు మహర్దశ

**4 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**పటాన్‌చెరు:** ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పాటి, ఘనపూర్, కర్దనూర్, నందిగామ, భానూరు, రుద్రారం, క్యాసారం, పాశమైలారం, ఇస్నాపూర్, లక్డరం గ్రామాల పరిధిలో నాలుగు కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రణాళికబద్ధంగా గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రభుత్వం అందించే నిధులతో పాటు సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్నామన్నారు. ఘనాపూర్ గ్రామం విశాఖ ఇండస్ట్రీస్ వరకు 2 కోట్ల 25 లక్షల రూపాయలతో రహదారి పనులకు శంకుస్థాపన చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుష్మాశ్రీ వేణుగోపాల్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సుప్రజా వెంకట్ రెడ్డి, ఎంపీడీఓ బన్సీలాల్, పంచాయతీరాజ్ డీఈ సురేష్, దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

## పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

**మియాపూర్ :** పరిసరాల శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. చందానగర్ డివిజన్ పరిధిలోని ఎంఎస్ఆర్ పాఠశాలలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్, స్వచ్ఛ హైదరాబాద్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మంజుల మాట్లాడుతూ పరిసరాల శుభ్రత మనందరి బాధ్యత అని తెలిపారు. విద్యార్థి దశనుండే శుభ్రతపై అవగాహన కల్గివుండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, జీహెచ్‌ఎంసి అధికారులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ ఓవరాల్ టాపర్ టీమ్ మైసా



**సాక్షి, సిటీబ్యూరో:** హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ రసవత్తరంగా సాగుతోంది. గ్రూప్ స్టేజ్ చివరి దశకు చేరగా, టాప్ 2లో నిలిచేందుకు పలు జట్లు నువ్వానేనా అన్నట్టు పోటీపడుతున్నాయి. నాలుగో రౌండ్ ముగిసేసరికి టీమ్ మైసా ఓవరాల్ టాపర్‌గా నిలిచింది. గ్రూప్–డీలో ఉన్న టీమ్ మైసా 639 పాయింట్లతో మిగిలిన జట్లపై స్పష్టమైన ఆధిపత్యం కనబరుస్తోంది. ఆ తర్వాత గ్రూప్–ఏ లో ఉన్న మీనాక్షి మావెరిక్స్ 634 పాయింట్లతో ఓవరాల్ జాబితాలో రెండో స్థానంలో కొనసాగుతోంది. ఇదే గ్రూప్‌లో సామా ఏంజెల్స్ 614 పాయింట్లతో ఉండగా.. గ్రూప్–బీలో టాప్ ప్లేస్ కోసం స్వింగ్ కింగ్స్, లాహిరి లయన్స్ మధ్య గట్టి పోటీ నడుస్తోంది. ఈ రెండు జట్లూ 614 పాయింట్లతో సమానంగా ఉన్నాయి. గ్రూప్– సీలో టీమ్ ఆల్ఫా 610 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా.. శనివారం జరిగే పోటీలతో నాకౌట్ బెర్తులు ఖరారు కానున్నాయి. ప్రస్తుతం 16 జట్ల మధ్య పాయింట్ల తేడాతో పెద్దగా లేకపోవడంతో నాకౌట్ రేస్ ఉత్కంఠ రేపుతోంది. దేశవ్యాప్తంగా యువ గోల్ఫర్లను ప్రోత్సహించేందుకు లీగ్ నిర్వహిస్తుండగా.. ఫైనల్ పోటీలు థాయ్‌లాండ్‌లో జరుగుతాయి.

## టర్కిస్ సూఫీ సంగీత ప్రదర్శన

**మాదాపూర్:** కొన్య టర్కిస్ సూఫీ సంగీత ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంది. మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో శుక్రవారం టర్కీ రాయబార కార్యాలయం, టైమ్స్ ఆఫ్ ఇండియాల ఆధ్వర్యంలో టర్కిస్ సూఫీ సంగీత ప్రదర్శన నిర్వహించారు. టర్కీ కాన్సల్ జనరల్ ఓర్హన్ యల్మన్ మాట్లాడుతూ ఇరు దేశాలు భిన్నం అయినప్పటికి సంస్కృతులు ఒక్కటే అన్నారు. సూఫీ సంగీతాన్ని నగరవాసులు ఎంతగానో ఆనందిస్తారని తెలిపారు.



మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో టర్కిస్ సూఫీ కళాకారుల ప్రదర్శన

## ముంపునకు శాశ్వత పరిష్కారం

**ఎమ్మెల్యే గాంధీ**

**హఫీజ్‌పేట్ :** ముంపునకు శాశ్వత పరిష్కారం దిశగా నాలా విస్తరణ పనులు చేపడుతున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరికపూడి గాంధీ పేర్కొన్నారు. శుక్రవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఈర్ల చెరువు నుంచి జాతీయ రహదారి వరకు చేపట్టిన నాలా విస్తరణ పనులను కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలా విస్తరణ సుమారు 2.4 కిలో మీటర్ల మేర రూ.15.88 కోట్ల వ్యయంతో నాలా పనులు జరుగుతున్నాయన్నారు. అధికారులు సమన్వయంతో కలిసి పని చేసి పనులలో పురోగతి సాధించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గౌతమ్‌గౌడ్, శ్రీనివాస్ యాదవ్, లక్ష్మారెడ్డి, అన్వర్ షరీఫ్, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నాలా విస్తరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

## పేదలకు డబుల్ ఇళ్లు ఇవ్వాలి

**శేరిలింగంపల్లి:** అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని సీఐటీయూ మండల శాఖ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి తహశీల్దార్‌కు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ శేరిలింగంపల్లి కార్యదర్శి కె.కృష్ణ మాట్లాడుతూ మండల పరిధిలో సొంత ఇల్లు లేక ఎంతోమంది ఇబ్బందిపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు డబుల్ ఇళ్లు ఇవ్వడంతో పాటు ఖాళీ స్థలం ఉన్న వారికి రూ.5లక్షలు ఇవ్వాలని కోరారు. అదే విధంగా గోపన్‌పల్లి సర్వే నంబర్ 36లోని ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.శంకర్, సీఐటీయూ నాయకులు సెవ్యా తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ మండల కార్యదర్శి కృష్ణ

## విద్యుత్ చార్జీల పెంపు ఆలోచన తగదు



మియాపూర్ మదీనాగూడ ఏడీఈ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీఎల్‌ఎఫ్ నాయకులు

**మియాపూర్ :** విద్యుత్ చార్జీల పెంపును ఒప్పుకోమని బీఎల్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు వనం సుధాకర్ డిమాండ్ చేశారు. మియాపూర్‌లోని విద్యుత్ ఏడీఈ కార్యాలయం వద్ద విద్యుత్ చార్జీలను ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ.. బీఎల్‌ఎఫ్ శేరిలింగంపల్లి కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. అనంతరం ఏడీఈ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూనిట్‌పై ముప్పై పైసలను పెంచే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేని ఎడల ప్రజా సమీకరణ పోరాటాలు చేస్తామని ప్రభుత్వాన్ని గద్దెదింపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఎల్‌ఎఫ్ శేరిలింగంపల్లి నాయకులు దశరథ్ నాయక్, సుకన్య, తుకారాం నాయక్, విమల, లావణ్య, అనిల్‌కుమార్, భాగ్యమ్మ, రాజు పాల్గొన్నారు.

## యూత్ ఫెస్టివల్ విజేతలకు సత్కారం

**రాయదుర్గం:** విద్యార్థుల ప్రతిభ పెంపొందించేందుకు కృషి చేయాలని వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ కార్యాలయం ఆధ్వర్యంలో సౌత్, ఈస్ట్ జోన్ యూత్ ఫెస్టివల్ విజేతలకు శుక్రవారం సన్మానం చేశారు. భారతీయ విశ్వవిద్యాలయాల సంఘం ఆధ్వర్యంలో కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గా విశ్వవిద్యాలయంలో ఉత్సవాలు నిర్వహించారు. దీనిలో మనూ క్విజ్ జట్టు రెండవ బహుమతి గెలుచుకోగా, ఫొటోగ్రఫీ విభాగంలో ఐదవ బహుమతి వచ్చింది. క్విజ్ బృందంలో విద్యార్థులు అలియానిదా, మహ్మద్ నసీమ్, గుల్నాజ్‌పరీన్ ఉన్నారు. ఫొటోగ్రఫీలో డానిష్‌రజాకు బహుమతి లభించగా, మైమ్ టీమ్‌లో మహ్మద్ ఫహీమ్, మహ్మద్‌నఫీస్ ఆలమ్, మహ్మద్ షాజాన్ హుస్నాపర్వీన్, ఆలమ్‌ఖాన్, అబ్రార్ అహ్మద్ ఉన్నారు.



విజేత విద్యార్థులతో వీసీ సయ్యద్ ఐనుల్‌హసన్

## హెచ్‌సీయూ డిస్టెన్స్‌లో డిప్లొమా కోర్సులు

**రాయదుర్గం:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో దూరవిద్యా విధానంలో డిప్లొమా కోర్సులు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. హెచ్‌సీయూలోని సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ వర్చువల్ లెర్నింగ్ (సీడీవీఎల్) ద్వారా బ్లెండెడ్ మోడ్‌లో అందించే ఒక సంవత్సరం డిప్లమో కోర్సుల కోసం దరఖాస్తులు కోరుతున్నారు. బిజినెస్ మేనేజ్‌మెంట్, ప్రాజెక్టు మేనేజ్‌మెంట్, సైబర్‌లాస్, ఫోరెన్సిక్ సైన్స్, లైబ్రెరీ ఆటోమేషన్ నెట్ వర్కింగ్, కమ్యూనికేటివ్ ఇంగ్లిష్, ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్ కంట్రోల్, కమ్యూనిటీ ఐ హెల్త్, ఇతర నైపుణ్యాలలో గ్రాడ్యుయేట్‌ల ప్రయోజనానికి ఈ కోర్సులు నిర్వహిస్తున్నారు. మరిన్ని వివరాల కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో సంప్రదించాలి.

## బీజేపీ నూతన కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, భిక్షపతి యాదవ్, రవికుమార్ యాదవ్, హరీష్ రెడ్డి తదితరులు

**భాగ్యనగర్‌కాలనీ:** హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, వివేకానందనగర్, కూకట్‌పల్లి నాలుగు డివిజన్‌లకు సంబంధించి భారతీయ జనతాపార్టీ కార్యాలయంను రాష్ట్ర నాయకులు రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో చేవెళ్ల మాజీ పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డిలు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్యకర్త, నాయకుల కోసం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నూతన కార్యాలయం ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. భిక్షపతి యాదవ్ మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా పని చేసినప్పుడు జరిగిన అభివృద్ధే కానీ ఇప్పుడున్న ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ దాచుకోవడం, దోచుకోవడం తప్ప కేసీఆర్ చేసింది ఏమీ లేదన్నారు. ఇతర ప్రాంతం వాళ్లు తప్పు చేస్తే ఇక్కడి నుంచి వెళ్లగొట్టమన్న కేసీఆర్‌కు లక్షల కోట్లు మింగిన కేసీఆర్‌ను ఈ ప్రాంతం వారే బొంద పెట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, నర్సింగరావు, కమలాకర్ రెడ్డి, భూపాల్ రెడ్డి, రవీంద్రరావు, నర్సింగ్ యాదవ్, చారి, సీతారామరాజు, నాగులు గౌడ్, రామరాజు, కుమార్ యాదవ్, దేవి రెడ్డి, జ్యోతి, శ్రీలత, నవత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'మీ సమస్య- మా పోరాటం' ద్వారా సమస్యలను పరిష్కరిస్తాం

**ఆల్విన్‌కాలనీ:** శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని ఆల్విన్‌కాలనీ డివిజన్ సాయి కాలనీ వద్ద బీజేపీ జెండాను ఆవిష్కరించి, ఆల్విన్‌కాలనీ ఫస్ట్ ఫేజ్, ఈస్ట్ సాయికాలనీలో ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు శేరిలింగంపల్లి కంటెస్టడ్ ఎమ్మెల్యే అభ్యర్థి గజ్జెల యోగానంద్ శుక్రవారం పర్యటించారు. తులసినగర్‌లోని కనకదుర్గ ఆలయం వద్ద డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేక రోడ్డుపై మురుగునీరు పారుతోందన్నారు. గుడికి వచ్చే భక్తులు ఇబ్బందిపడుతున్నారన్నారు. ప్రభుత్వ స్థలాలు ఖాళీగా ఉన్నా కనీసం ప్లే గ్రౌండ్ , పార్కు, కమ్యూనిటీ హాలు నిర్మించకుండా అధికార పార్టీ నాయకులు ఈ స్థలాలను కబ్జా చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నారని ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన రాజీవ్ గృహకల్ప ఇళ్లను అధికార పార్టీకి చెందిన వారు దౌర్జన్యంగా లాక్కుని, తిరిగి వాటిని అద్దెకు వచ్చి డబ్బులు వసూలు చేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రజా సమస్యలపై ' మీ సమస్య– మా పోరాటం' ద్వారా వీటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు విజిత్ వర్మ, సురభి రవీందర్, స్రవంతి, రామరాజు, రఘు, రామకృష్ణ, రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మురుగు సమస్యపై స్థానికులతో మాట్లాడుతున్న నాయకుడు యోగానంద్, బీజేపీ నాయకులు